క్లుప్తంగా

సంత వేలం రూ.16.50లక్షలు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రతి శనివారం జరిగే సంత వేలంపాటను కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య రూ.16,50,000లకు పాటపాడి దక్కించుకున్నట్లు ఎంపీడీఓ కిన్నెర యాకయ్య సోమవారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక వేలం రూ.85,500

నర్సింహులపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 15 ట్రిప్పుల ఇసుకను రెవెన్యూ అధికారులు వేలం వేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిల్వగా ఉన్న ఇసుకను టిప్పుకు రూ.5700 చొప్పున రూ.85,500లకు మండల కేంద్రానికి చెందిన రమేశ్ వేలంపాటలో దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాభవానికి ఏపీజే అబ్దుల్ కలాం పరిశోధన అవార్డు



తొర్రూరు రూరల్: తమిళనాడు రాష్ట్రంలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం నుంచి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పరిశోధన అవార్డును తొర్రూరు మండలంలోని సోమారం గ్రామానికి చెందిన కాకిరాల దుర్గభవాని సోమవారం అందుకున్నారు.

బడికి పంపించాలని బైక్‌పై ప్రచారం




కేసముద్రం: పిల్లలను బడికి పంపించాలని, ఇందుకు ప్రవేశ దరఖాస్తు చేసుకోవాలని సోమవారం మండలంలోని కల్వల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పరిమి నవీన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ, బైక్ ర్యాలీతో వినూత్నరీతిలో ప్రచారం చేశారు. బైక్ ర్యాలీ కల్వల నుంచి చెట్లముప్పారం, ఇనుగుర్తి, మహముద్‌పట్నం గ్రామాల వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్వేత, జయరేఖ, వీరబాబు, సురేందర్, దుర్గా భాస్కర్, రమేశ్, నర్సయ్య, పూర్ణ, యాకయ్య పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలి


కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి వట్టి వాగులోకి ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, ఉప్పరపల్లి మాజీ సర్పంచ్ ఎలబోయిన సారయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ దామోదర్‌కు ఉప్పరపల్లి గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంకిరెడ్డి వీరయ్య, దేవేందర్, కోటయ్య, ఖాసీం, ఉపేందర్, సురేందర్, సాయి పాల్గొన్నారు.

సవ్వారు లచ్చమ్మ పండుగ



తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలోని ఎస్సీ కులస్థులంతా కనుల పండుగగా సవ్వారు లచ్చమ్మ పండుగ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా ఉదయం సమయంలో జలబిందెలతో డప్పుచప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకొని సవ్వారు లచ్చమ్మ విగ్రహాలను శుద్ధి చేసి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నైవేద్యంతో కూడిన బోనాలను ఆటపాటలు, కోలాటాలు, శివసత్తులతో నృత్యాలు చేస్తూ ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కేసముద్రం: కేసముద్రంస్టేషన్, ఉప్పరపల్లి, కల్వల జెడ్పీ హైస్కూల్‌లో, మోడల్ స్కూల్‌లో, ఇనుగుర్తి, కోమటిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో వేం ట్రస్టు ఆధ్వర్యంలో 400మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, రావుల మురళీ, ఎండి.అయూబ్‌ఖాన్, గంట బాలకృష్ణారెడ్డి, గండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ త్వరలో జరిగే అన్వేల్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని పరీక్ష ప్యాడ్లను సోమవారం గ్రామానికి చెందిన పల్లె పోతుల లక్ష్మీనర్సయ్య అందించినట్లు ఎంఈఓ రాందాస్ తెలిపారు.

‘మనబడి’కి నిధులు కరువు

- నిలిచిన తెల్లబండతండా పాఠశాల పనులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



తెల్లబండతండాలో అసంపూర్తిగా పాఠశాల భవనం



వరండాలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

డోర్నకల్: మండలంలోని తెల్లబండతండా ప్రభుత్వ పాఠశాల భవనం పరిస్థితి దీనావస్థలో ఉంది. మన ఊరు–మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు మూడు సంవత్సరాల క్రితం మన ఊరు–మన బడి పథకంలో భాగంగా సుమారు రూ.20లక్షలతో తెల్లబండతండా పాఠశాల భవన అభివృద్ధి పనులు చేపట్టారు. సుమారు 70శాతం పనులు పూర్తయిన తరువాత పలు కారణాలతో పనులు నిలిచాయి. పాఠశాల భవనానికి ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, విద్యుత్, తాగునీటి సౌకర్యాలకు సంబంధించి పనులు పూర్తి కాలేదు. భవనం వరండాను ఎత్తుగా నిర్మించి మెట్లు కట్టకపోవడంతో విద్యార్థులు భవనంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు రూ.20వేలు సొంత డబ్బు ఖర్చు చేసి భవనానికి మెట్లు నిర్మించి వరండాలో కొంత భాగానికి ఫ్లోరింగ్ చేయించి విద్యార్థులకు వరండాలోనే విద్యను బోధిస్తున్నారు. భవనం నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు సగం వరకే బిల్లులు రావడంతో నిర్మాణ పనులు నిలిపినట్లు తెలిసింది. భవన నిర్మాణ పనులు అసంపూర్ణంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల గేటు విరిగి దారికి అడ్డంగా పడడం, ఆవరణలో కంకరు రాళ్లు తేలి ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతుల కొరత, ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరితో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గత సంవత్సరం పాఠశాలలో 30మంది వరకు ఉండగా ప్రస్తుతం వీరి సంఖ్య పది మందికి చేరింది. 5వ తరగతి వరకు ఉండే పాఠశాలలో ఒకటో తరగతిలో ఒకరు, రెండో తరగతిలో ఏడుగురు, నాల్గో తరగతిలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థుల సంఖ్య తగ్గి పాఠశాల మూతబడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి పాఠశాలలో అసంపూర్ణంగా మిగిలిన నిర్మాణ పనులు పూర్తి చేసి, మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కృషి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

గార్ల: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, పేదల ఆశాజ్యోతిగా నిలిచారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం గార్లలోని రైతువేదిక భవనంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు పథకాలు ప్రభుత్వం త్వరలో పూర్తిస్థాయిలో అమలు చేస్తుందన్నారు. రానున్న వేసవికాలంలో మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఇప్పటినుంచి ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మార్చి నెలాఖరు నాటికి అర్హులైన రైతులందరికీ రైతుభరోసా ఇస్తామని పేర్కొన్నారు. మండలంలో 45మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ రూ.45,05220 చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ భూక్యా నాగేశ్వర రావు, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ మంగమ్మ ఏఓ కావటి రామారావు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో సోమవారం ఈజీఎస్‌పై నిర్వహించిన, 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయా గ్రామాలలో జరిగిన అవకతవకలు వెలుగు చూశాయి. ఈ సభకు డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు హాజరుకాగా, సామాజిక తనిఖీ బృందం, ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇట్టి సామాజిక తనిఖీ ప్రజావేదికకు, గ్రామాల నుంచి ప్రజలు హాజరు కాకపోవడంతో, సభ తూతూ మంత్రంగా నడిపినట్లు విమర్శలు వస్తున్నాయి. ఎక్కువ మొత్తంలో అధికారులు, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఈజీఎస్ స్టాఫ్ మాత్రమే హాజరయ్యారు. మొత్తంగా 40 గ్రామాలకు గాను, 27గ్రామాలకు ప్రజావేదిక జరిగినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ అధామ్, డీపీసీ మదన్‌మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్, ఎస్ఆర్‌పీ కుమార్, ఏపీవోలు శ్రీను, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న నల్లు సుధాకర్‌రెడ్డి

మరిపెడ రూరల్: రైతుభరోసా కింద రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో రైతాంగానికి వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మూడో మహాసభ నీలికుర్తి గ్రామంలో నిర్వహించారు. ఈసభకు ముఖ్యఅతిథిగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు నాగేశ్వర్‌రావు, నలు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ సిఫారసులు అమలు చేయకుండా, కనీస మద్దతు ధర ఓ కలగానే మిగిలిందన్నారు. రైతుల ఆత్మహత్యలే శరణ్యంగా మారిందన్నారు. నల్లచట్టాలను అమలు చేయాలనే కుట్ర పూరిత విధానాలపై రైతాంగం సంఘటితంగా ఉద్యమించాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అనపర్తి సత్యం, జనార్దన్, మారగాని బాలకృష్ణ, ఎండీ అబ్దుల్ రషీద్, వెంకన్న, రామయ్య పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

నెహ్రూసెంటర్: ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని, పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి పలువురు సీపీఎంలో చేరారు. అనంతరం సోమయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, చాగంటి భాగ్యమ్మ, స్వామి, భిక్షపతి, రవి, ఉమాకళ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులు



ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

దంతాలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం షాపును తరలించాలని ఎంపీఓ అప్సర్ పాషా, కార్యదర్శి వెంకన్నకు స్థానికులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. జన సంచార ప్రాంతానికి 100మీటర్ల దూరం ఉండాలనే ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా, సూర్యాపేట రోడ్డుకు జనసంచార ప్రాంతం అయిన రెండు కాలనీల మధ్య మద్యం షాపు నిర్వహిస్తున్నారన్నారు. షాపులో మద్యం తాగిన వారు ఇళ్ల పక్కన మూత్ర విసర్జన చేస్తున్నారన్నారు. రాత్రి సమయంలో మహిళలు తిరగడానికి భయపడుతున్నారని తెలిపారు. ఇక్కడి నుంచి మద్యం షాపును తరలించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీస్ మండల అధ్యక్షుడు సోమారపు లింగన్న, ధర్మారపు వెంకన్న పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణం



మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకుడు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శివాలయంలో వైభవోపేతంగా పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రెడ్యాల శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి దంపతులు, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, బండెల సంజీవరెడ్డి, చిన్నం గణేష్, ఆలయ ఈఓ సత్యనారాయణ, జంపీరావు వీరభద్రస్వామి ఆలయం నుంచి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ శివాలయానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12:52గంటలకు మాంగల్యధారణ కార్యక్రమాన్ని జరిపించారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



కురవిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కురవి: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించమే ప్రభుత్వ లక్ష్యమని మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్‌లు అన్నారు. ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయించడం పట్ల సోమవారం మండల కేంద్రంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌కుమార్, బండి శ్రీనివాస్, గార్లపాటి వెంకట్‌రెడ్డి, రజనీకాంత్, మోహన్‌రావు పాల్గొన్నారు. సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మరిపెడ/దంతాలపల్లి: ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గాంధీ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘువీరారెడ్డి, యుగేందర్‌రెడ్డి, తాజుద్దీన్, అప్సర్, రవికాంత్, అజీజ్ పాల్గొన్నారు.

నివాళి

నెహ్రూసెంటర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మాజీ ఎమ్మెల్యే తీగల సత్యానారాయణ అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి అన్నారు. సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా మూడుకోట్ల సెంటర్ వద్ద ఆయన విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

ఆత్మరక్షణకు కరాటే అవసరం

దంతాలపల్లి: సమాజంలో మహిళలు తమను తాము రక్షించుకోవాలంటే కరాటే ఎంతో ముఖ్యం అని దాట్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య అన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షకురాలు ఝాన్సీ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రశంస పత్రాలు అందజేశారు.

చర్య తీసుకోవాలి

గార్ల: దిశ పేపర్ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తున్న పేపర్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణ గౌడ్, గుండా వెంకట్‌రెడ్డి, బాబూలాల్, యాకూబ్ పాషా, హతీరాం, పృథ్వీరాజ్ ఉన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవం

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో సోమవారం బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని బొడ్రాయితోపాటు ఆంజనేయస్వామి ఆలయాల్లో గ్రామస్తులు జలాభిషేకాలు నిర్వహించారు.

స్వయంపాలన దినోత్సవం

గూడూరు: మండలంలోని సీతానగరం ఎంపీపీఎస్ లో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పులి దేవేందర్ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులుగా వ్యవహరించే విధానం నేర్పించారు.

దుబ్బతండాలో..

తొర్రూరు రూరల్: మండలంలోని దుబ్బతండాలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు.

గోశాలకు దూడల తరలింపు

తొర్రూరు: ఆవుదూడలను పట్టణంలోని గోశాలకు తరలించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గోశాల అధ్యక్షుడు దారం కుమారస్వామి తెలిపిన వివరాల మేరకు.. ఆవుదూడలతో మహబూబాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటోను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ సీఐ సూచన మేరకు కానిస్టేబుల్ రమేష్‌చంద్ర రెండు ఆవులు, రెండు కోడె దూడెలను తొర్రూరులోని గోశాలకు తరలించారు.

ఎస్సారెస్పీ కాల్వకు గండి



కురవి: మండలంలోని మొద్దులగూడెం సమీపంలోని రేగులకుంటలోకి నీటిని తరలించేందుకు ఆదివారం రాత్రి తండాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులు ఎస్సారెస్పీ కాల్వకు గండి పెట్టారు. కాలువకు గండిపడడంతో గ్రామానికి చెందిన నాయిని వేణుగోపాల్‌రెడ్డి అనే రైతుకు చెందిన 10ఎకరాల మామిడితోట, ఆరు ఎకరాల పొలంలోనికి నీటివరద వచ్చింది. ఈ విషయాన్ని సోమవారం రైతు గుర్తించాడు.

ఘనంగా గరుడ హవనం

మహబూబాబాద్ రూరల్: శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు భాగవతుల వంశీకృష్ణమాచార్యులు, సత్యంగౌతం మహరాజ్ సేవా కాలం, బాల భోగం, నివేదన, మంగళాశాసనం పూజలు నిర్వహించారు.

శంకుస్థాపన

డోర్నకల్: డోర్నకల్ శివారు మున్నేరు వాగు ఒడ్డున నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మతల్లి ఆలయానికి సోమవారం శంకుస్థాపన చేశారు. యాదవ సంఘం ప్రతినిధులతోపాటు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సన్మానం

మరిపెడ రూరల్: 14 ఏళ్ల పోరాటం ఫలితంగా ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో తమను టీచర్లుగా నియమించిందని డీఎస్సీ 2008 సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరుగు భాస్కర్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎస్సీ 2008 కాంట్రాక్టు టీచర్లను ఎంఈఓ అనితాదేవిని ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజేందర్, లలిత, శ్రీదేవి, క్రాంతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కేసముద్రం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మంచాల వెంకన్న అనే వ్యక్తి కేసముద్రం నుంచి బైక్‌పై, ఉప్పరపల్లికి వెళ్తుండగా, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఏసబ్ల పద్మ అనే మహిళ పంట చేను వద్ద నుంచి గేదెను ఇంటికి తీసుకెళ్తుంది. ఈక్రమంలో ఉప్పరపల్లి సమీపంలో వెనక నుంచి వచ్చిన బైక్ ప్రమాదవశాత్తు ఆమెను ఢీకొట్టింది. దీంతో పద్మ కాళ్లకు, చేతులకు తీవ్రగాయాలు కాగా, ఆమెను వరంగల్ ఆస్పత్రికి తరలించారు. వెంకన్నకు తలకు తీవ్రగాయాలు కాగా అతన్ని మానుకోట జనరల్ ఆస్పత్రికి 108లో తరలించారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు రూరల్: వరికి వచ్చే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ భాస్కర్ కోరారు. సోమవారం మండలంలోని నాంచారీమడూరు గ్రామశివారులోని వరిపంట సాగును వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు.

పశువులకు గర్భకోశ చికిత్స తప్పనిసరి

పెద్దవంగర: పాడి రైతులు ఎదకు వచ్చిన పశువులను గుర్తించకపోతే క్రమంగా వాటిలో పునరుత్పత్తి స్థాయి తగ్గుతుందని మండల పశువైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు.

సాగునీరు అందించాలని రైతుల నిరసన



ఎస్సారెస్పీ కాల్వలోకి దిగి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిన్నగూడూరు: మండలంలోని తుమ్మలచెరువు, విస్సంపల్లి గ్రామాలకు చెందిన రైతులు యాసంగి పంటలు ఎండిపోతున్నాయని సాగునీరందించాలని సోమవారం ఎస్సారెస్పీ కాల్వలోకి దిగి నిరసన తెలిపారు. ఈసందర్భంగా గ్రామ రైతులు శ్రీశైలం, సైదులు, వెంకన్న మాట్లాడారు. ఇరిగేషన్ డీఈ రాజ్‌కుమార్ ఎస్సారెస్పీ కాల్వను పరిశీలించేందుకు రాగా వారితో వాగ్వాదానికి దిగారు. పంటలకు సాగునీరు అందించేలా చూడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ అర్బన్: త్వరలో జరగనున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక ఎన్నికల్లో బీజేపీ నాయకులు పోటీ చేసి విజయం సాధించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం స్థానిక ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తుందని, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగిన బీజేపీదే విజయం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచవల్ శ్యామ్‌సుందర్ శర్మ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ సతీష్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గడ్డం అశోక్, పట్టణ అధ్యక్షుడు అజయ్, రూరల్ అధ్యక్షుడు జహిందర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



తొర్రూరు: ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

తొర్రూరు: పంచాయతీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. ఈమేరకు డివిజన్ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రవి మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాడ్య భీకు, మండల అధ్యక్షులు గుండాల సోమనర్సయ్య పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని వినతి

దంతాలపల్లి: మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని మహాత్మగాంధీ ఉపాధి హామీలో గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు ఇప్పించాలని సోమవారం ఎంపీడీఓ వివేక్‌రామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఫీల్డ్‌అసిస్టెంట్లు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ అనేక సేవలు అందిస్తున్నామన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రంజిత్, యర్రం శంకర్, విజయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సావిత్రీ బాయి పూలేకు ఘన నివాళి



నెహ్రూసెంటర్: సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల, పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రీ బాయి పూలే జీవితమంతా అణగారిన వర్గాల వారికి విద్య అందించారని, వితంతు మహిళలను అక్కున చేర్చుకొని పునర్వివాహాలు చేశారని, ఆమె సేవలను కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్

నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు

గార్ల: బీటీ రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ముత్తితండా నూతన బీటీ రహదారి నిర్మాణ పనుల వద్ద టీజీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరినాయక్ మాటాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీను రమేష్, మల్సూర్, శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.